క్లుప్తంగా

విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్

గన్నవరం: మండలంలోని కేసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం జగనన్న స్ఫూర్తి స్టడీ మెటిరియల్ బుక్స్ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక చేతుల మీదుగా పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకుగాను ప్రభుత్వం స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం భూపతి మనూజ, వార్డు సభ్యులు మూల్పూరి మాధవన్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు



నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నున్న గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నందు చిన్నపిల్లలకు టీకాలు, గర్భిణులకు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా మొదటి బుధవారం, రెండో శనివారం జరిగే కార్యక్రమాల్లో భాగంగా 40 మంది చిన్న పిల్లలకు టీకాలు వేశామని కమ్యూనిటీ హెల్త్ అధికారి సుస్మిత తెలియజేశారు. గర్భిణులకు బీపీ, సుగర్ రక్త హీనత పరీక్షలు నిర్వహించి, వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. సూపర్‌వైజర్ బీఎంఆర్ రత్నం, ఏఎన్‌ఎం శ్రీలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. దోమల నివారణకు మందులను కార్మికులు గ్రామంలోని పలు చోట్ల స్ప్రే చేశారు. మురుగు ప్రాంతాలను గుర్తించి ఆ ప్రదేశాల్లో ముందస్తుగా దోమల నివారణ చర్యలు చేపట్టారు.

ఘనంగా ఇరుముడి కార్యక్రమం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో వేంచేసియున్న శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప భక్తుల ఇరుముడి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత అయ్యప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వామి చెరుకూరి సాయిబాబునాగేశ్వరరావు నేతృత్వంలో మండల దీక్ష పూర్తి చేసుకున్న 108 మంది అయ్యప్ప భక్తులకు ఇరుముడులు కట్టారు. ఇరుముడులను శిరస్సుపై పెట్టుకుని భక్తులు అయ్యప్పస్వామి దర్శనం నిమిత్తం శబరిమల బయలుదేరివెళ్లారు. తొలుత సుమారు రెండు వేల మందికి అన్న సమారాధన జరిపారు.

మహిళపై వ్యక్తి దాడి.. కేసు నమోదు

పెనమలూరు: భార్యభర్తలు గొడవ పడుతుండటంతో గొడవ ఆపటానికి యత్నించిన మహిళపై దాడి జరిగింది. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటకు చెందిన భార్గవి గత కొద్ది సంవత్సరాల క్రితం మల్లిఖార్జునరావు అనే వ్యక్తిని ప్రేమించి, కులాంతర వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. భార్య ఉద్యోగం చేస్తుండగా భర్త ఖాళీగా ఉంటున్నాడు. అయితే మంగళవారం భార్యభర్తలు తగాదాపడ్డారు. భార్య భార్గవిపై భర్త మల్లిఖార్జునరావు దాడి చేయటానికి యత్నించగా, భార్గవి అక్క మేకా లక్ష్మి అడ్డుకుంది. దీంతో మల్లిఖార్జునరావు కోపంతో లక్ష్మిపై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

నలుగురిపై బైండోవర్ కేసులు

పెనమలూరు: కోడి పందేలు నిర్వహించే నలుగురు వ్యక్తులను పోలీసులు బుధవారం బైండోవర్ చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కోడిపందేలు నిర్వహించే పెనమలూరుకు చెందిన షేక్ ఇమామ్‌బాషా, తాడిగడపకు చెందిన డి.నరసింహారావు, కానూరు వినాయక్‌నగర్‌కు చెందిన గడ్డం రాంబాబు, యనమలకుదురుకు చెందిన చందు వెంకట శ్రీనివాసరావులపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. మండల పరిధిలో కోడి పందేలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సర్పంచ్ ఔదార్యం



పెనమలూరు: గంగూరు గ్రామంలో కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు గ్రామ సర్పంచి తస్లీమున్నీసా తన గౌరవ వేతనం అందించారు. గ్రామంలో కొత్తగా 25 మందికి పింఛన్ ప్రభుత్వం మంజూరు చేసింది. వీరికి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచి తస్లీమున్నీసా పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన రూ. 2,750తో పాటు ఆమె తన గౌరవ వేతనం నుంచి తలా రూ. 250 చొప్పున సొమ్ము జోడించి లబ్ధిదారుడికి రూ. 3 వేలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అక్బర్‌బాషా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: రాష్ట్రంలో జగనన్న పాలన బలోపేతం చేసే విధంగా సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పెనమలూరు సెంటర్‌లో కిలారు అనిల్ ఎస్టేట్‌లో నియోజకవర్గ పరిశీలకుడు రావిపాటి శ్రీనివాస్ అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు బుధవారం సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల వ్యవస్థను అమలులోకి తీసుకు వచ్చి ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. జగనన్న ఆలోచనలను వార్డు/గ్రామ స్థాయిలో వలంటీర్లు అమలు చేయటంతోనే నేడు లక్షల మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందగలుగుతున్నారని వివరించారు. ఇప్పుడు ప్రభుత్వం సచివాలయాల పరిధిలో కన్వీనర్లను నియమించి సంక్షేమ పథకాలు వలంటీర్లతో కలిసి మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. పార్టీ కార్యకర్తలు, వలంటీర్లను సమన్వయం చేయాల్సిన బాధ్యత కన్వీనర్ల పైనే ఉంటుందని తెలిపారు. అలాగే పార్టీ కార్యక్రమాలలో కూడా చురుకైన పాత్ర పోషించాలన్నారు. ప్రధానంగా ఓటర్ల జాబితాలో లోపాలు గుర్తించాలని సూచించారు. త్వరలో గృహసారథులను కూడా నియమిస్తారని, వీరు వలంటీర్లతో కలిసి పని చేస్తారని అన్నారు.

చంద్రబాబును నమ్మొద్దు..

చంద్రబాబు పెద్ద మోసగాడని, అతను ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దగా చేశాడని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆరోపించారు. రైతులు రుణాలు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానని వచ్చి మోసం చేశారన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు, 23 వేల మందికి ఇళ్ల స్థలాలు జగనన్న ఇస్తే చూసి ఓర్వలేక చంద్రబాబు,అతని మీడియా విషం కక్కుతోందని విమర్శించారు. పెనమలూరు నియోజకవర్గంలో మూడున్నర సంవత్సరాల్లో రూ 1590 కోట్లు లబ్ధి చేకూర్చామని, టీడీపీ పాలనలో కంటే రోడ్లు, ఇతర అభివృద్ధి తామే చేశామని, దీని పై చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు పి.రాఘవరావు,ఈడే చాముండేశ్వరి, సర్పంచిలు శ్రీనివాస చౌదరి, సంగీపు శ్రీనివాసరావు, అక్బర్‌బాషా, నేతలు అన్నే చిట్టిబాబు, కిలారు శ్రీనివాసరావు, చాంద్‌బాషా, వెలగపూడి వరప్రసాద్, గుమ్మడి విజయ్‌కుమార్, మరీదు శ్రీను, యార్లగడ్డ వీరబాబు, వేమూరి బాలకృష్ణ, తాళ్ల నరేంద్ర, చెక్కా గోపీ, వేమూరి రాజా, వల్లే నరసింహారావు, నర్రాచంటి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం



అంబాపురం(విజయవాడరూరల్): గ్రామంలోని ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకొంటామని అంబాపురం గ్రామ సర్పంచి గండికోట సీతయ్య అన్నారు. బుధవారం గ్రామ కార్యదర్శి భారతి, సచివాలయం సిబ్బంది, వార్డు సభ్యులతో ప్రజల వద్దకే వెళ్లి సర్పంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 4, 10 వార్డుల్లో ప్రజలను ఇంటింటికీ వెళ్లి సమస్యల అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ కాల్వలు సరిగా తీయడం లేదని, దోమల బెడద అధికంగా ఉందని ప్రజలు వివరించారు. వీధి దీపాలు సరిగా వెలగక పోవడంతో వృద్ధులకు రాత్రి సమయాల్లో రోడ్డుకు రావాలంటే ఇబ్బందిగా ఉంటుందన్నారు. గ్రామంలో హౌస్ హోల్డ్ సర్వే జరగక పోవడం వల్ల ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలను పొందలేక పోతున్నామని, వెంటనే సర్వే నిర్వహించాలని కోరారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సర్పంచి ప్రజలకు హామీ ఇచ్చారు.

ముక్తేశ్వరాలయంలో ధనుర్మాస పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలం పెరికీడులోని ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో ప్రతిరోజు తిరుప్పావై ప్రవచనాలు నిర్వహిస్తున్నారు. నల్లాన్ చక్రవర్తుల భూదేవి ఆధ్వర్యంలో భక్తులకు విష్ణుభక్తి వైశిష్ట్యం గూర్చి వివరిస్తున్నారు. ఈ నెల 14వ తేదీన గోదారంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కొల్లి మర్ల రంగారావు, ఘంటా బాబ్జీ, తవ్వా కుటుంబరావు, కాసులు తెలిపారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని భవిత కేంద్రంలో అంధుల లిపి సృష్టికర్త లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంధుల లిపి రూపొందించేందుకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. లిపి ద్వారా అంధులు సైతం చదువులో రాణించి, ఉన్నత స్థితికి చేరుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు బి.అంజనాదేవి, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు కె.సుశీల, జె.నాగమణి పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

గడప గడపలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. చోడవరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన వారికి బ్రోచర్‌లు అందజేశారు. అనంతరం గ్రామంలో సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు విషం కక్కుతున్నాయన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా నిలుపుదల చేయాలని ప్రతిపక్షాలు కుట్రపన్నుతున్నాయని అన్నారు. గడచిన మూడున్నరేళ్లలో దాదాపు 98 శాతం హామీలు ప్రభుత్వం నెరవేర్చిందన్నారు.

పింఛన్ సొమ్ము పెంపు..

గత ఎన్నికల్లో జగనన్న ఇచ్చిన హామీ మేరకు నేడు పింఛన్ సొమ్మును ప్రభుత్వం రూ. 2,500 నుంచి రూ. 2,750 వరకు పెంచిందన్నారు. జగనన్న ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము రూ. 3 వేలు వరకు పెంచుతారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాకర్ల వెంకటరత్నం, ఎంపీడీఓ సునితా శర్మ, ఉపసర్పంచి పి.సాంబయ్య, నేతలు మండూరు కోటేశ్వరరావు, మానికొండ సూర్యతేజ, ఉద్దంటి బాబూరావు, లింగాల సాంబయ్య, శైలజ, చుంటూరు శేఖర్, ఈడే గోపాలకృష్ణ, విష్ణువర్ధన రావు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్ రాణి

గన్నవరం రూరల్: విద్య కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి చెప్పారు. బుధవారం మండలంలోని వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ అందించిన స్ఫూర్తి పుస్తకాలను విద్యార్థులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తకాలు తీసుకున్న 69 మంది విద్యార్థులు ఈ పుస్తకంలో అన్ని సబ్జెక్టులను చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలల కేంద్రంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల సహకారంతో ట్రిపుల్ ఐటీలో గణనీయమైన సీట్లు సంపాదించాలని చెప్పారు. హెచ్‌ఎం ఆలపాటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, వీరపనేనిగూడెం, కొత్తగూడెం ఎంపీటీసీ సభ్యులు నందిపాటి పద్మావతి, చిలకపాటి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ఎస్‌బీఐ రుణాలు



మాట్లాడుతున్న చైర్మన్ చలసాని, చిత్రంలో ఎస్‌బీఐ అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పాడిరైతులు గేదెలు కొనుగోలు చేసుకునేందుకు వీలుగా రుణాలు మంజూరు చేసేందుకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో కృష్ణామిల్క్ యూనియన్ ఎంవోయూ కుదుర్చుకున్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని కాకాని వెంకటరత్నం పాల ఉత్పత్తిదారుల భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో స్టేట్ బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.రాధిక, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు వివరాలు వెల్లడించారు. పాల దిగుబడిని పెంచేందుకు, రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కృష్ణా మిల్క్ యూనియన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చలసాని చెప్పారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రాధిక మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు ఎలాంటి హామీ లేకుండా 7 శాతం వడ్డీరేటుతో రూ.2 లక్షల వరకు రుణాన్ని మంజూరు చేస్తామని చెప్పారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్లు టి.రామతీర్థం ప్రసాద్, ఎస్.వెంకటేశ్వరరావు, మేనేజర్ టీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కంకిపాడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రాజెక్టు సీడీపీఓ కె.బి.సుకన్య తెలిపారు. బుధవారం ఆమె స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కంకిపాడు మండలం కుందేరు-2 అంగన్‌వాడీ కార్యకర్త (జనరల్), కంకిపాడు-10 (మినీ అంగన్‌వాడీ కార్యకర్త) (బీసీ-బీ), అంగన్‌వాడీ సహాయకురాలు ఈడుపుగల్లు-1 (ఎస్‌సీ), కంకిపాడు-8 (జనరల్) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పెనమలూరు మండలంలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు పెనమలూరు-3 (బీసీ-బీ), వణుకూరు-1 (ఎస్‌సీ), యనమలకుదురు-8 (బీసీ-బీ) ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాలను రిజర్వు చేసిన ప్రకారం అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కంకిపాడు ప్రాజెక్టు కార్యాలయంలో స్వయంగా అందించాలని సూచించారు.

అర్హులందరికీ పింఛన్లు



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం కొత్తగా ప్రభుత్వం మంజూరు చేసిన 366 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీలో మొత్తం 12,420 మంది లబ్ధిదారులకు పింఛన్లు ఇస్తున్నామన్నారు. పింఛన్‌ల వెరిఫికేషన్ కోసం నోటీసులు ఇస్తే టీడీపీ నేతలు పైశాచిక ఆనందం పొంది, చంకలు గుద్దుకున్నారన్నారు. అయితే అధికారుల విచారణ అనంతరం అందరికీ పింఛన్లు ఇచ్చామని తెలిపారు. తాడిగడప మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగంగా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.ప్రకాశరావు, గ్రామ పార్టీ కన్వీనర్ మున్నంగి అర్జున్‌రెడ్డి, నేతలు పి.రాఘవరావు, అద్దేపల్లి చందు, నల్లమోతు జీవన్, బందెల రాజు, పి.రవి, చలమల జోజి, కిశోర్ పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

కంకిపాడు: సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) అన్నారు. మండలంలోని కోలవెన్ను పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన 25 పింఛన్లను స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రశేఖర్ (బుడ్డి) మాట్లాడుతూ పేద వర్గాల అభ్యున్నతి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించి ఆయా కుటుంబాల్లో సంతోషాలు విరిసేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమ పాలన సాగిస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విషప్రచారం సాగిస్తున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు తోకల ఉమాదేవి, స్థానిక నాయకులు టెక్కెం సతీష్‌కుమార్, కంచర్ల శేషగిరి, కొప్పురాజు సురేష్, ఈఓ శివకుమార్ పాల్గొన్నారు.



కొత్త పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ దేవగిరి సుజాత ఓంకార్ రెడ్డి



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్

అర్హతే ప్రామాణికంగా పెన్షన్ల మంజూరు

పాతపాడు(విజయవాడరూరల్): వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా.. అర్హతే ప్రామాణికంగా పెన్షన్లు మంజూరు చేస్తున్నారని పాతపాడు గ్రామ సర్పంచి దేవగిరి సుజాత ఓంకార్‌రెడ్డి అన్నారు. పాతపాడు గ్రామ పంచాయతీ పరిధిలో పాతపాడు, మంగళాపురం, అప్పారావు పేట గ్రామాలకు చెందిన 17 మందికి ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుకను మంజూరు చేసింది. ఆ లబ్ధిదారులకు బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి సుజాత, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ దేవగిరి ఓంకార్ రెడ్డి పెన్షన్లు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి గ్రేడు-5 భరత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: చోడవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చోడవరం గ్రామానికి చెందిన కిలారు నాగేశ్వరరావు బైక్ పై పెనమలూరు నుంచి చోడవరంలో ఇంటికి వెళ్తున్న సమయంలో నాగేంద్రస్వామి గుడి వద్ద ఎదురుగా వచ్చిన ఆటో అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతని కాలుకు తీవ్ర గాయమయింది. పోరంకి ఆస్పత్రిలో అతనిని చికిత్సకై చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కానూరులో మరో మహిళకు గాయాలు..

కానూరు మహదేవపురంకాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహదేవపురంకాలనీకి చెందిన ఎస్.నాగవిమలభారతి ఇంటి సమీపంలో ఉన్న సూపర్ మార్కెట్‌లో సరుకులు కొనుగోలు చేసుకుని తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఆమెను ఢీ కొట్టింది. ఆమెకు ఈ ఘటనలో గాయాలు అవ్వటంతో కానూరులో ఆస్పత్రిలో చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైక్ నడిపిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మునగతో రక్తహీనత నివారణ



మధిరపాడులో మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సరోజిని

ఉంగుటూరు: రక్త హీనత ఉన్న వారికి మునగ మేలు చేస్తుందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మునగ మొక్కల పంపిణీ బుధవారం జరిగింది. మధిరపాడులో జరిగిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని డ్వాక్రా మహిళలకు మొక్కలు అందజేశారు. మహిళలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు మునగ సహాయపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు, ఈవోపీఆర్‌డీ బాషా, ఏపీఎం సాంబశివరావు, ఉపాధి హామీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఐదుగురు జూదారుల అరెస్ట్

వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించామని ఎస్ఐ పల్లా నాగకల్యాణి బుధవారం తెలిపారు. గ్రామంలోని మామిడి తోట దగ్గర ఉన్న రజకుల చెరువు వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో శిబిరంపై దాడిచేసి ఐదుగురు జూదారులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి సుమారు రూ. 5,220 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిని గురువారం కోర్టుకు తరలిస్తామని ఎస్ఐ తెలిపారు.

తైక్వాండో పోటీల్లో విజేతకు అభినందన



రజత పతకం పొందిన ప్రవీణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సాంబశివరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ ఖాన్‌దు బాయ్ సేనైహాల్‌లో గత నెల 24, 25 తేదీల్లో జరిగిన 37వ జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి రజత పతకం సాధించాడని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మండవ సాంబశివరావు తెలిపారు. కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో సీనియర్ ఇంటర్ సీఈసీ చదువుతున్న టి.ప్రవీణ్ అండర్-18 బాలుర విభాగంలో 70 కేజీల వెయిట్ సామర్థ్యంలో సెల్ఫ్ డిఫెన్స్ విభాగంలో రజత పతకం సాధించాడన్నారు. ప్రవీణ్‌ను కళాశాల వ్యాయామ అధ్యాపకుడు కె.మార్కండేయులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

దాతృత్వం చాటుకున్న పోలీసులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు సహాయం అందిస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులు మరోమారు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విజయవాడ యనమలకుదురుకు చెందిన శ్రావణి తండ్రిని కోల్పోయింది. తల్లి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ క్రమంలో శ్రావణికి బీఫార్మసీలో సీటు వచ్చిన నేపథ్యంలో మొదటి సంవత్సరం కాలేజీ ఫీజు కట్టేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో పోలీసు సిబ్బంది నిర్వహించే దీవెన ఫౌండేషన్ గురించి తెలుసుకున్న ఆమె వారిని సంప్రదించింది. వెంటనే స్పందించిన వారు బుధవారం ఏపీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును ఆయన చాంబర్‌లో కలుసుకుని ఆయన చేతుల మీదుగా శ్రావణికి 15 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ బ్రహ్మం, శరత్‌కుమార్, గోపిచంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ పేదలకు సాయం చేయడంలో దీవెన ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిలో జనవరి 7వ తేదీ నుంచి వివిధ అంశాల్లో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీ కేర్ అసిస్టెంట్, జ్యూట్ క్రాఫ్ట్ ప్రొడక్ట్స్ మేకర్, అసిస్టెంట్ ప్లంబింగ్ శానిటరీ వర్క్, అసిస్టెంట్ హ్యాండ్ ఎంబ్రాయిడరీ, కట్టింగ్ అండ్ టైలరింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్ రిపేర్, హోమ్ క్రాఫ్ట్స్ జామ్ అండ్ జ్యూస్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, మెషీన్ ఎంబ్రాయిడరీ అంశాల్లో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866-2470420 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.